సాక్షి
కాకినాడ
గురువారం | 17 | అక్టోబర్ | 2024



అన్నదానానికి విరాళం


ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామివారి నిత్యాన్న దాన ట్రస్టుకు ఎరబ్రల్ల హరీష్ శర్మ (కాకినాడ) రూ.50 వేలు, తేతలి వీర వెంకట సత్యనారాయణరెడ్డి (కుతుకులూరు) రూ.10,116 విరాళం అందజేశారు.



రూ.50,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బట్లంకి భుజంగరావు దంపతులు (తాడేపల్లిగూడెం) రూ.50,116 విరాళం అందించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 6,800 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

పాదగయ హుండీ ఆదాయం రూ.46.29 లక్షలు



హుండీల్లో డబ్బు లెక్కిస్తున్న భక్తులు

పిఠాపురం: కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం, పాదగయ క్షేత్రంలో హుండీ ఆదాయం రూ.46,28,750 సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు. దేవస్థానానికి సంబంధించిన హుండీలను బుధవారం తెరచి లెక్కించగా, 210 రోజులకు కరెన్సీ రూపంలో రూ.42,67,170, నాణేల రూపేణా రూ.3,61,580 మొత్తం రూ46,28,750 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ పి.విశ్వనాథరాజు వివరించారు. కాకినాడ డివిజన్ దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి.ఫణికుమార్, దేవస్థానం సిబ్బంది, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, శ్రీవారి సేవా సంఘ సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలతో నేడు జేసీ సమావేశం

కాకినాడ సిటీ: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కళ్లం నుంచి రైసు మిల్లు పథకం కింద ధాన్యం రవాణా చేసేందుకు ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలను నియమించే విషయమై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్టు జేసీ రాహుల్ మీనా బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల వారు సమావేశానికి హాజరుకావచ్చన్నారు.

ప్రో కబడ్డీ అంపైర్‌గా మురళీకుమార్



సామర్లకోట: కబడ్డీ క్రీడాకారుడు, ఫిజికల్ డైరెక్టరు బోగిళ్ల మురళీకుమార్ ప్రో కబడ్డీ 11వ సీజన్‌కు అంపైర్‌గా ఎంపికయ్యారు. హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా, ఢిల్లీ, పాట్నాల్లో శుక్రవారం నుంచి జరిగే ప్రో కబడ్డీ మ్యాచ్‌లకు మురళీకుమార్ అంపైర్‌గా వ్యవహరిస్తారు. ఈ నెల 18 నుంచి ప్రారంభ వేదిక హైదరాబాద్‌లో మ్యాచ్‌లు మొదలవుతాయని మురళీకుమార్ తెలిపారు. ఆయన బుధవారం సామర్లకోట నుంచి బయలుదేరి వెళ్లారు. రాష్ట్రం నుంచి ఆయన ఏకైక అంపైర్ కావడం విశేషం. జగ్గంపేట జెడ్పీ హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు తొమ్మిది పర్యాయాలు అంపైర్‌గా వ్యవహరించారు. ఆయనను ఉమ్మడి జిల్లా కబడ్డీ సంఘ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు, రాష్ట్ర కోచ్ పోతుల సాయిప్రసాద్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ఉండవిల్లి ప్రసాద్, మన్యం చంద్రరావు, రంగా, బలరామ్, గంగాధర్ అభినందించారు.

మెరుగైన సేవలు అందించండి: ఏలూరి రేంజ్ ఐజీ



త్రీటౌన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

కాకినాడ క్రైం: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కాకినాడ త్రీటౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సీఐ సత్యనారాయణను అభినందించారు. ఆయన వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ ఉన్నారు.

చంద్రబాబు మెప్పుకోసమే..

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సీఎం చంద్రబాబు నాయుడు మెప్పు కోసమే రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ అధ్యక్షుడు షారూక్ షుబ్లీ అనైతిక వ్యాఖ్యలు చేస్తున్నారని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం అన్నారు. రాజమహేంద్రవరంలో మైనార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. టీడీపీ అడుగులకు మడుగులొత్తే షారూక్‌కు హజ్ యాత్ర, మాజీ ముఖ్యమంత్రి జగన్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. 2023లో విజయవాడ ఎంబరిగేషన్ పాయింట్ వచ్చిందని, అప్పుడు సీఎంగా ఎవరున్నారని ప్రశ్నించారు. 2023, 24ల్లో 2,453 మంది హజ్ యాత్రకు వెళ్లారని రికార్డులు చెబుతున్నాయన్నారు. హాజీలు హజ్ యాత్ర కోసం చెల్లించే ప్రతి పైసా నేరుగా సెంట్రల్ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఖాతాలో చేరుతుందన్నారు.

తమరికి పట్టుదా..!?

- నాసిరకం గుడ్లతో గూళ్లు కట్టని పురుగులు
- ప్రైవేటుగా కొనుక్కోమన్న సెరికల్చర్ అధికారులు
- ఒక్కో రైతుకు రూ.80 వేల పెట్టుబడి
- రూ.2 లక్షల రాబడి కోల్పోయిన వైనం
- చేబ్రోలులో 50 మందికి రూ.కోటి వరకు నష్టం



గూళ్లు కట్టని పట్టు పురుగులు

సిల్క్ సిటీ కలగా మిగిలింది. బకాయిల విడుదల, ప్రోత్సాహకాల పెంపు ఊసే లేదు. ఇదంతా ఎన్నికల్లో 'పట్టు'కోసమే అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పట్టు పరిశ్రమ అభివృద్ధికి అంత చేస్తాం, ఇంత చేస్తాం అని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఇప్పుడు నష్టాల ఊబిలో కూరుకుపోతున్న పట్టు రైతుల కన్నీటిని తుడిచే ప్రయత్నం చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పిఠాపురం: నాసిరకం గుడ్లతో పట్టు రైతులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. రెండు పంటలుగా రైతులకు నష్టాలు వస్తున్నా.. సంబంధిత సెరికల్చర్ అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పట్టు పురుగుల పెంపకానికి మూలబిందువైన పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలంలో పట్టు పరిశ్రమ పాలకుల నిర్లక్ష్యంతో గడ్డు కాలం ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో పలమనేరు, హిందూపురంతో పాటు, కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టుగూళ్ల కొనుగోలు కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో కోనసీమ అమలాపురం, రాజమహేంద్రవరం మినహా ఏజెన్సీలో 5, పెద్దాపురం డివిజన్లో 12, కాకినాడ డివిజన్లో 2 మండలాల్లో మొత్తం 4,500 ఎకరాల్లో 1,150 మంది రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. ఇప్పుడు సుమారు 130 మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది. నెల రోజుల క్రితం కూడా ఇలాగే రెండు సార్లు జరిగింది. ఇది కేవలం (రామ్‌నగర్) గ్రైనేస్ గుడ్లలోనే జరిగింది. సుమారు ఒక్కొక్క పంటకు రూ.80 వేల పెట్టుబడులను రైతులు నష్టపోయారు. అవసరమైన గుడ్లను సెరికల్చర్ అధికారులే సరఫరా చేయాల్సి ఉంది. వీరు పట్టించుకోకపోవడం వల్ల ఈ నష్టం వాటిల్లింది. రైతులే గుడ్లు తెచ్చుకోవాలని జిల్లా ఉన్నతాధికారి సైతం చెప్పడంతో, వారు సొంతంగా కొనుగోలు చేస్తున్నారు ఈ క్రమంలో నాణ్యత లేని గుడ్లనూ కొనుగోలు చేయాల్సి వస్తోంది. సెరికల్చర్ ఉద్యోగులు నామమాత్ర విధులు మాత్రమే నిర్వహిస్తున్నారు. ముందుగా అప్రమత్తం చేయాల్సిన సెరికల్చర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, ఇప్పుడు మరింత మంది రైతులు ఇంకా నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పట్టు సాగు వివరాలు

పట్టు సాగు చేస్తున్న మండలాలు	19
గ్రామాలు	155
పట్టు రైతులు	1,150
సాగు చేస్తున్న భూమి	4,500 ఎకరాలు
పట్టుగూళ్ల దిగుబడి	రోజుకు 5 టన్నులు

రైతులకు న్యాయం చేస్తాం

ప్రస్తుతం పట్టు పురుగులు గూళ్లు కట్టడం లేదు. ఈ విషయమై సంబంధిత కంపెనీ వాళ్లతో, శాస్త్రవేత్తలతో మాట్లాడాం. ఈ రకం గుడ్లు అన్నిచోట్లా బాగానే ఉన్నాయి. కేవలం ఇక్కడ మాత్రమే సమస్య వచ్చిందంటున్నారు. చేబ్రోలు పట్టు గూళ్ల షెడ్ల వద్ద ఇతర పంటలకు పురుగుల మందులు పిచికారీ చేయడం వల్ల పురుగులు గూళ్లు కట్టక పోయి ఉండవచ్చని చెబుతున్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– గీతా రాణి, జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి, కాకినాడ

అధికారులు కూడా ఇప్పటికే మూడుసార్లు ఈ విధంగా నష్టం వచ్చినప్పటికీ, రైతులకు అవగాహన కల్పించడం కానీ, మేలైన గుడ్లు అందించడానికి చర్యలు కానీ చేపట్టలేదు. పెట్టుబడి రూ.80 వేలతో పాటు, వీరికి రావాల్సిన రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల ఆదాయం కూడా కోల్పోతున్నారు. పంట సమయం కూడా నష్టపోతున్నారు

సిల్క్ సిటీ ఏమైందో?

గతంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి పట్టు రైతులు తమ సమస్యలను చెప్పుకొన్నారు. వారి కోరిక మేరకు ఆయన చేబ్రోలులో పట్టు పరిశ్రమ కేంద్రాన్ని పరిశీలించి, ఈ ప్రాంతాన్ని సిల్క్ సిటీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. బకాయిల విడుదల, ప్రోత్సాహకాల పెంపు తదితర సమస్యలన్నీ పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కానీ, నెలలు గడుస్తున్నా వాటి ఊసే లేదని పట్టు రైతులు వాపోతున్నారు. తాము రూ.లక్షల్లో నష్టాల పాలవుతున్నా.. పవన్ కల్యాణ్ స్పందించక పోవడంతో తమకు తీరని అన్యాయం జరిగిందంటూ రైతులు ఆలస్యంగానైనా గుర్తించారు.

పట్టు వదిలేసిన ప్రభుత్వం

సాధారణంగా పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన మేలు జాతి గుడ్లను ప్రభుత్వం పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు అందించాలి. కొంత కాలంగా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధికారులు ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించారు. గుడ్లు కావాలంటే ప్రైవేటుగా కొనుగోలు చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించి.. చేతులు దులుపుకొంటున్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ క్రమంలో నాణ్యత కొరవడి పంట పూర్తిగా నష్టపోతున్నట్టు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం అందించే గుడ్లు నాణ్యతగా ఉంటాయని, ప్రైవేటుగా కొన్నవి నాణ్యత లేక, నష్టం వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పురుగులే కానీ గూళ్లు లేవు

ప్రభుత్వం అందించకపోవడంతో ప్రైవేటుగా గుడ్లు కొనుగోలు చేశాం. పట్టు పురుగులు పెరుగుతున్నాయి కానీ, గూళ్లు కట్టడం లేదు. గుడ్ల నుంచి పురుగులు వచ్చిన తర్వాత సుమారు 45 రోజుల్లో పట్టు గూళ్లు కట్టాలి. అలా జరిగితేనే పట్టు వస్తుంది. మేము కొన్న గుడ్ల ద్వారా వచ్చిన పురుగులు పెరుగుతున్నాయి. నెలల తరబడి గూళ్లు కట్టడం లేదు. దీంతో పెట్టుబడి రూ.80 వేలు, రాబడి రూ.2 లక్షల వరకు నష్టపోయాం.

– ఇంటి సూరిబాబు, పట్టు రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పట్టు గూళ్ల పెంపకం కత్తిమీద సాములా మారింది. పట్టు పురుగుల గుడ్లను పట్టు పరిశ్రమ ద్వారా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకుంటే రైతులు ప్రైవేటు వ్యాపారుల ద్వారా మోసపోతున్నారు. పట్టు పురుగులు గూళ్లు కట్టకపోతే ఒక్కో రైతుకు సుమారు రూ.3 లక్షల వరకు రాబడి కోల్పోతారు. ఇలా రెండు దఫాలుగా నష్టాలు వచ్చాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

– ఉలవకాయల నాగలోవరాజు, పట్టు రైతు, జెడ్పీటీసీ, గొల్లప్రోలు



ఎన్నికలకు ముందు పట్టు రైతుల సమస్యలను ఆలకిస్తున్న పవన్ కల్యాణ్ (ఫైల్)

జీజీహెచ్ అభివృద్ధికి చర్యలు



ఓపీ కౌంటర్ వద్ద రోగి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ షణ్మోహన్

కలెక్టర్ షణ్మోహన్ సగిలి

కాకినాడ క్రైం: ప్రతిష్టాత్మకమైన కాకినాడ జీజీహెచ్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. బుధవారం ఆయన కాకినాడ జీజీహెచ్‌ను సందర్శించారు. ఓపీ కౌంటర్ల వద్ద రోగులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు వార్డుల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు విభాగాలలో ఉన్న పరికరాల కొరతను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అత్యవసర వైద్య సేవలపై కలెక్టర్ ఈ సందర్భంగా ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, జీజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత సహా, వివిధ విభాగాల హెచ్‌వోడీలు ఉన్నారు.

పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి హైకోర్టులో పిల్

కాకినాడ లీగల్: పోలీస్ శాఖలో ఉన్న ఉద్యోగ ఖాళీలు, పోలీసులకు ప్రమోషన్లు వెంటనే అమలు చేయాలంటూ కాకినాడకు చెందిన పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కీతినేది అఖిల్ శ్రీగురుతేజ హైకోర్టులో గత నెల 25న ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. బుధవారం ఆయన ఇక్కడ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీస్ శాఖలో ఉద్యోగ ఖాళీలు ఏటా భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖలో 19,999 ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని హైకోర్టులో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (170/2024) దాఖలు చేశారు. బుధవారం హైకోర్టులో దీనిపై విచారణ జరిగింది. పోలీస్ శాఖలో ఉద్యోగ ఖాళీలపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ కేసు విచారణను వచ్చే నెల ఆరో తేదీకి వాయిదా వేసింది.

అన్నం లేని క్యాంటీన్

- పిఠాపురం అన్న క్యాంటీన్‌లో అరకొరగా భోజనాలు
- తెరచిన కొద్ది సేపటికే చేతులెత్తేస్తున్న సిబ్బంది




పిఠాపురంలో అన్న క్యాంటీన్

పిఠాపురం: అన్నార్తుల ఆకలి తీర్చడానికి మరో డొక్కా సీతమ్మగా ఆవిర్భవించినవే అన్న క్యాంటీన్లు అంటూ కూటమి నేతలు ఆర్భాటంగా ప్రచారం చేసుకుని ప్రారంభించిన అన్నా క్యాంటీన్లలో అన్నం దొరకక ఆకలితో అలమటిస్తున్నామని నిరుపేదలు వాపోతున్నారు. పిఠాపురం అన్నా క్యాంటీన్‌లో కొన్ని రోజులుగా తెరచిన కొద్ది సేపటికే భోజనం నిండుకుంది అంటు సిబ్బంది చెబుతుండడంతో వచ్చిన వారు ఆందోళనకు దిగుతున్నారు. రెండు రోజులుగా ఒక వ్యక్తి అన్న క్యాంటీన్‌లో జరుగుతున్న తంతును తన సెల్‌ఫోన్లో రికార్డు చేసి సోషల్ మీడియా వేదికగా అన్న క్యాంటీన్లో అన్నం లేదంటూ చేస్తున్న ప్రచారం వైరల్‌గా మారింది. రోజుకు 400 మందికి భోజనం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు చెబుతుండగా కేవలం 100 మందికి మాత్రమే భోజనం పెట్టి చేతులు దులిపేసుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. నిర్ణీత సమయానికే వెళ్లినా భోజనం అయిపోయింది అని చెబుతున్నారని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అన్నం పెట్టలేనప్పుడు అంత ఆర్భాటం చేయడమెందుకు అంటూ విమర్శిస్తున్నారు.

కడలి కన్నెర్ర



బీచ్ రోడ్డు వద్ద ఎగసిపడుతున్న అలలు



సముద్రంలో అలల ఉధృతి



ఉప్పాడ బీచ్ రోడ్డును తాకుతున్న కెరటాలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో కడలి కన్నెర్ర చేస్తోంది. తీరంలో మత్స్యకారుల గృహాలపై అలలు ఎగసి పడుతున్నాయి. ముఖ్యంగా ఉప్పాడ, కోనపాపపేటల్లో కడలి కల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండడంతో అక్కడ ఇళ్లు కోతకు గురవుతున్నాయి. గృహాల్లోకి సముద్రం నీరు చొచ్చుకురావడంతో మత్స్యకారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉప్పాడ తీర ప్రాంతానికి రక్షణగా వేసిన జియో ట్యూబ్ గోడ పూర్తిగా ధ్వంసం కావడంతో సముద్రం చొచ్చుకు వస్తుంది. గృహాలతో పాటు చెట్లు, రోడ్లు కూడా సముద్ర గర్భంలో కలుస్తున్నాయి. ఇప్పటికే తుఫాన్ కారణంగా ఉప్పాడ మత్స్యకార గ్రామం పూర్తిగా కోతకు గురైంది.

బీచ్‌రోడ్డులో అలలు

వాయుగుండం ప్రభావంతో సముద్రం అలలు ఎగసి పడుతున్నాయి. బీచ్ రోడ్డులో రక్షణగా వేసిన బండరాళ్ల గోడను సైతం దాటి రోడ్డు మీదకు దూసుకొస్తున్నాయి. ఆ దారిలో ప్రయాణం సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రత్నగిరిపై కల్యాణ కాంతులు

- సత్యదేవుని సన్నిధిలో జోరుగా వివాహాలు
- బుధవారం రాత్రి 7.45 ముహూర్తంలో ఒక్కటైన 150 జంటలు
- స్వామివారిని దర్శించిన 40 వేల మంది భక్తులు
- రెండు వేల వ్రతాల నిర్వహణ
- రూ.40 లక్షల ఆదాయం



రత్నగిరిపై బుధవారం రాత్రి వివాహానికి హాజరైన పెళ్లి బృందాలు

అన్నవరం: పవిత్రమైన రత్నగిరిపై కల్యాణ కాంతులీనాయి. సత్యదేవుని సన్నిధిలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతుండడంతో ఆలయ ప్రాంగణం నవ దంపతులు, పెళ్లిబృందాలతో ప్రత్యేక సందడి నెలకొంది. బుధవారం రాత్రి 7.45 గంటల ముహూర్తంలో రత్నగిరిపై వివిధ సత్రాలు, ఉచిత కల్యాణ మంటపాల్లో 150కి పైగా వివాహాలు జరిగాయి. సత్యగిరిపై శ్రీసత్య శ్రీనివాస ఉచిత ఏసీ కల్యాణ మండపం, అలాగే ఎంఎస్ రెడ్డి అంజనీ ఉచిత వివాహ వేదిక కల్యాణ మండపంలో ఇదే ముహూర్తంలో 24 వివాహాలు జరిగాయి. విష్ణుసదన్‌లోని 34 వివాహ వేదికల్లో కూడా వివాహాలయ్యాయి. హరిహర సదన్ సత్రం చుట్టూ ఖాళీ ప్రదేశాల్లో కూడా పెళ్లిళ్లు జరిగాయి. దీంతో దేవస్థానంలో ఎక్కడ చూసినా పెళ్లి బృందాలు, వారి వాహనాలే దర్శనమిచ్చాయి.



రామాలయం వద్ద విశ్రాంతి మంటపంలో పెళ్లిళ్లు

భారీగా దర్శించుకున్న భక్తులు

అన్నవరంలో స్వామివారిని బుధవారం సుమారు 40 వేల మంది భక్తులు దర్శించి, పూజలు చేశారని అధికారులు తెలిపారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రత మంటపాలు, విశ్రాంత మంటపాలు నవ దంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రదర్శన దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. ఆయా విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

గురువారమూ కొనసాగనున్న రద్దీ

కాగా, బుధవారం రాత్రి రత్నగిరిపై వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధుమిత్రులతో పాటు, ఇతర ప్రాంతాల్లో పెళ్లిళ్లు చేసుకున్నవారు కూడా గురువారం సత్యదేవుని దర్శించనున్నారు. దీంతో రత్నగిరిపై రద్దీ కొనసాగనుంది.

నేడు ప్రత్యంగిర హోమం

ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా గురువారం వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి 11 వరకు హోమం జరిపి, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొనవచ్చు.

క్లుప్తంగా

ఈదురు గాలుల బీభత్సం



యర్రా గార్డెన్స్‌లో కారుపై కూలిపోయిన విద్యుత్ స్తంభం

యానాం: నియోజకవర్గ పరిధిలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యానాంలోని యర్రా గార్డెన్స్ మొదటి వీధిలో పార్కు చేసిన కారుపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతింది. అలాగే భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. పలు వీధులు జలమయమయ్యాయి. వాహన చోదకులు, ప్రజలు అవస్థలు పడ్డారు. వాతావరణశాఖ సూచనల మేరకు ప్రజలను, మత్స్యకారులకు స్థానిక అధికారులు అప్రమత్తం చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



సంస్కృతిని అభినందిస్తున్న హెచ్‌ఎం రవీంద్రనాథ్, పీడీ సరస్వతి

దేవరపల్లి: జమ్మూలో సెప్టెంబరు 30 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలలో రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని రాపాక సంస్కృతి రజత పతకం సాధించింది. శ్రీకాకుళం జిల్లా పలాసలో గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన బాలిక, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ కూడా తన సత్తా చాటింది. ఈ సందర్భంగా సంస్కృతిని ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్, పీడీ టి.సరస్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

పిడుగు శబ్దానికి వ్యక్తికి అస్వస్థత

పెరవలి: పిడుగు పడిన శబ్దానికి ఒక వ్యక్తి తీవ్ర అవస్థతకు గురయ్యాడు. తహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలోని ఎస్సీ ఏరియాలో బుధవారం సాయంత్రం పిడుగుపడింది. ఆ శబ్దానికి అక్కడే నివసించే 45 ఏళ్ల విపర్తి గంగాధర్ మూర్ఛపోయాడు. అతడిని వెంటనే తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం గంగాధర్ కాళ్లు, చేతులు పనిచేయటం లేదు.

ప్రతిభ మీది.. ప్రోత్సాహం వీరిది..

- 7, 10 విద్యార్థులకు మెరిట్ టెస్ట్
- సత్తా చాటిన వారికి బహుమతులు
- రిజిస్ట్రేషన్‌కు నవంబరు 14 తుది గడువు



విద్యార్థులు

పోటీ పరీక్షలు, స్కాలర్‌షిప్ టెస్టులతో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే అవకాశం కలుగుతుంది. వారిలో పోటీతత్వం పెరిగి మరింత బాగా చదువుకునేందుకు దోహదపడుతుంది. ఇదే ఉద్దేశంతో ఎడ్యుకేషన్ ఎపిఫనీ అనే సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తోంది. ఈ విద్యా సంవత్సరానికి పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఒక్క రూపాయి ఫీజు కట్టనవసరం లేకుండా, నచ్చిన చోటు నుంచే, ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష రాసుకునే అవకాశం ఉంది.

రాయవరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వంతో పాటు, పలు ఎన్‌జీవో ఆర్గనైజేషన్లు ఏటా వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తుంటాయి. ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎడ్యుకేషనల్ ఎపిఫనీ అనే సంస్థ మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ)ను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి నిర్వహించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష జరుగుతుంది. ఎటువంటి రుసుము తీసుకోకుండా గత 12 ఏళ్లుగా ఈ పరీక్ష నిర్వహిస్తూ ఉండడం గమనార్హం. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించే ఈ పరీక్షకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు విజయరామరాజు ఈ నెల 15న షెడ్యూల్ విడుదల చేశారు.

రెండు దశల్లో..

ఈఈఎంటీ పరీక్షను ప్రిలిమ్స్, మెయిన్ అనే రెండు దశల్లో నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఇష్టం ప్రకారం ఇంటి నుంచే లేదా పాఠశాల నుంచి హాజరయ్యే అవకాశం కల్పించారు. కోడ్ తంత్ర అనే సాఫ్ట్‌వేర్ ద్వారా పరీక్ష జరుగుతుంది. షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 29వ తేదీన ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. దానిలో 40 శాతం పైబడి మార్కులు పొందడంతో పాటు, ఆన్‌లైన్ పరీక్ష నియమ నిబంధనలు సక్రమంగా పాటించిన వారు మెయిన్ పరీక్షకు అర్హత పొందుతారు. ఆ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 19న జరుగుతుంది. దానిలో 50 శాతం మార్కులు పొంది, ఆన్‌లైన్ నిబంధనలు కచ్చితంగా పాటించిన వారికి బహుమతులు అందజేస్తారు.

సిలబస్

7, 10 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర అకడమిక్ క్యాలెండరు 2024–25 సిలబస్‌ను అనుసరించి, డిసెంబరు నాటికి పూర్తయిన సిలబస్‌పై 80 శాతం, జనరల్ నాలెడ్జ్‌పై 20 శాతం ప్రశ్నలు ఇస్తారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాలలో రాసుకోవచ్చు. గణితం, సైన్స్, సోషల్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, మేధా సంబంధిత ప్రశ్నలు ఇస్తారు. రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థి పేరు, పరీక్ష రాయదలచిన మొబైల్ నంబరు, విద్యార్థి/తల్లిదండ్రుల ఇమెయిల్, విద్యార్థి పుట్టిన తేదీ, ఫొటోలు, తరగతి, చిరునామా తదితర వివరాలు నమోదు చేసుకోవాలి.

పరీక్ష నిర్వహణ

గణితం, సైన్స్ (జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు), సోషల్ సబ్జెక్టులపై పరీక్ష ఉంటుంది. విద్యార్థుల తరగతి స్థాయి ఆధారంగా జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై ప్రశ్నలు ఇస్తారు. ప్రిలిమ్స్ పరీక్షలో 60 ప్రశ్నలు (100 మార్కులు), మెయిన్స్ పరీక్షలో 60 ప్రశ్నలు (100 మార్కులు) ఇస్తారు. తేలికపాటి వాటికి ఒక మార్కు, మధ్య రకం ప్రశ్నలకు రెండు మార్కులు, కఠిన మైన వాటికి మూడు మార్కులు కేటాయిస్తారు.

బహుమతులు

పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 162 మందిని ఎంపిక చేసిన దాదాపు రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో పదో తరగతిలో ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు అందిస్తారు. రాష్ట్రస్థాయిలో 7వ తరగతిలో రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున అందజేస్తారు. జిల్లా స్థాయిలో 10వ తరగతిలో రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, 7వ తరగతి విద్యార్థులకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు పంపిణీ చేస్తారు. ఇక మండల స్థాయిలో 10, 7 తరగతుల్లో ప్రథమ స్థానం పొందిన వారికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంసాపత్రాన్ని అందిస్తారు. పరీక్షలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 95731 39996, 96667 47996, 63032 93502 నంబర్లను సంప్రదించవచ్చు.

పరీక్ష రుసుము లేదు

పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎటువంటి రుసుం లేకుండానే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలాగే పరీక్ష కోసం దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా ఇంటి వద్దనే ఉండి లేదా పాఠశాలలో గానీ రాసుకునే వెసులుబాటు ఉంది. మొబైల్ ఫోన్/ల్యాప్‌టాప్/ట్యాబ్/ కంప్యూటర్ తదితర వాటిలో ఒక దాన్ని ఎంచుకుని, ఆన్‌లైన్ పరీక్ష నిబంధనలకు లోబడి పరీక్ష రాయాలి. ప్రిలిమ్స్ రాసే వారికి డిసెంబరు 22న, మెయిన్స్ పరీక్ష రాసే వారికి వచ్చే ఏడాది జనవరి 10న మాక్ టెస్టులు రాసే అవకాశం కల్పిస్తారు. **httpr://educationaepiphany.orfeemt2024/refirtration.php** లింక్ ద్వారా ఆసక్తి ఉన్న విద్యార్థులు నవంబరు 14 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్‌లో పరీక్షలు



ఈఈఎంటీ పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించేందుకు డాక్టర్ తవనం వెంకట్రావు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న సంస్థ ద్వారా ఉచితంగా పోటీలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ పరీక్ష రాసేలా ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి.

– దూదేకుల నబీ, రాష్ట్ర సమన్వయ కర్త, ఈఈఎంటీ 2025

సామర్లకోట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



సామర్లకోట రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే స్టేఫీ అధికారి కె.వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి ఐదుగురు బృందంతో వచ్చిన అధికారులు హైలెవెల్ సేఫ్టీ ఆడిట్ జరిపారు. తుని నుంచి రాజమహేంద్రవరం వరకు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా సామర్లకోటలో నాలుగు గంటలు తనిఖీలు చేశారు. రైల్వే ట్రాక్కు, సిగ్నల్ వ్యవస్థతో పాటు అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించారు. స్టేషన్‌లోని ఎస్ఎస్ కార్యాలయం, పార్సిల్ ఆఫీసు, నార్త్ కేబిన్, ఎల్‌సీ గేటు, ప్లాట్‌ఫాంపై రూములు, మరుగుదొడ్లు, కార్యాలయ రికార్డులను పరిశీలించి అనేక సూచనలు చేశారు. సామర్లకోట వచ్చిన వారికి స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ స్వాగతం పలికారు. ఆయనతో చీఫ్ ఆపరేషన్స్ మేనేజరు బి. రవిచందర్, వివిధ డిపార్టుమెంట్ల అధికారులు ఉన్నారు.

చోరీ ఘటనలో నిందితుల అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న వస్తువులతో డీఎస్పీ రమేష్ బాబు తదితరులు

కడియం: కడియపులంకలోని కర్రి వెంకటేశ్వరరావు ఇంట్లో ఈ ఏడాది జూన్‌లో జరిగిన చోరీకి ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రావణ కృష్ణ అలియాస్ శ్రవణ్‌లను బుధవారం కడియపులంకలో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కడియం పోలీస్‌స్టేషన్ సౌత్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ రమేష్ బాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ 18న కడియపులంకలో ఇంటికి తాళం వేసి ఉండడంతో నిందితులు ఇద్దరూ రాత్రిపూట తాళాలు పగలగొట్టారు. 108 గ్రాముల బంగారు వస్తువులు, 2 కేజీల వెండి, లాకర్‌లో పెట్టిన 1,0,8000 మాయం చేశారు. ఈ ఘటనపై జూన్ 19న కేసునమోదు చేసి కడియం ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వై.రాంబాబు తమ సిబ్బందితో దర్యాప్తు ప్రారంభించారు. అన్ని కోణాలలో దర్యాప్తు కొనసాగించి నేరస్తులను పట్టుకున్నారు. దొంగిలించిన వస్తువులను అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన పోతంశెట్టి గోపాలకృష్ణారెడ్డి అలియాస్ రెడ్డి దగ్గర దాచినట్లు గుర్తించారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో రెండు దొంగతనాలు, ప్రకాశం జిల్లా దర్శి, బాపట్ల జిల్లా చందోలులో ఒకొక్కటి చొప్పున చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 129 గ్రాముల బంగారం, 7.810 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

భార్యను వేధించినందుకు 18 నెలల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): భార్యను వేధించిన భర్తకు 18 నెలల జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం వీఏజేఎఫ్‌సీ కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరావు తీర్పునిచ్చారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, ఎస్సై షేక్ అమీనా బేగం తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు సమీపంలోని దొండపాడు గ్రామానికి చెందిన పూట్ల మోహన్ కృష్ణ రాజమహేంద్రవరానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. అయితే ఆమెను వేధింపులకు గురిచేయడంతో 2018లో మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మోహన్ కృష్ణపై నేరారోపణ రుజువు కావడంతో కోర్టు అతడికి 18 నెలలు జైలు, రూ.ఐదువేలు జరిమానా విధించింది. కాగా.. సాక్ష్యులను న్యాయస్థానంలో ప్రవేశ పెట్టడంలో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ ఎస్.వినోద్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

మద్యం దుకాణాల్లో అదనపు దందా



గోపాలపురంలో మద్యం షాపు ముందు మందుబాబుల క్యూ

గోపాలపురం: మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. లైసెన్సుదారులు షాపులను అట్టహాసంగా ప్రారంభించారు. అయితే మద్యం ధరలను తగ్గిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయాన్ని ఎన్నికల సమయంలో చెప్పారు. కానీ ఆచరణలోకి వచ్చే సరికీ ఆ విషయం మరుగునపడింది. కొత్త దుకాణాల్లో అధిక ధరకు మద్యం విక్రయిస్తుండడంతో మందుబాబులు ఆందోళన చెందుతున్నారు. గోపాలపురం మండలంలో గతేడాది నాలుగు మద్యం షాపులు ఉండేవి. నూతన మద్యం పాలసీ ద్వారా వాటిని మూడుకి కుదించారు. గతంలో గోపాలపురంలో రెండు, చిట్యాల, దొండపూడి గ్రామాలలో ఒక్కొక్కటి ఉండేవి. నూతన మద్యం పాలసీ ద్వారా రూ.99 కే క్వార్టర్ మద్యం అమ్మాలి. కానీ గోపాలపురంలోని మద్యం షాపులో క్వార్టర్ బాటిల్‌పై పది రూపాయాలు అదనంగా వసూలు చేశారు.

అదనపు వసూలు

తాళ్లపూడి: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మద్యం పాలసీపై అప్పుడే విమర్శలు మొదలయ్యాయి. మండలంలో బుధవారం నుంచి మద్యం షాపులు తెరచుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాటిల్‌పై దాదాపు రూ.20 అధికంగా వసూలు చేస్తున్నారని జనసేన మండల అధ్యక్షుడు గంటా కృష్ణ ఆరోపించారు. అన్ని కంపెనీల మద్యం విక్రయిస్తున్నప్పటికీ చీప్ లిక్కర్ తప్ప మిగిలిన అన్ని బ్రాండ్లపై అదనపు వసూళ్లు జరుగుతున్నాయన్నారు. దీంతో కొనుగోలుదారుల జేబుకు చిల్లు పడుతోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. మండలానికి కేటాయించిన నాలుగు షాపుల్లో తాళ్లపూడిలో రెండు, అన్నదేవరపేటలో ఒక్కటి, పెద్దేవంలో ఒకటి ఏర్పాటు చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవానికి డబ్బుల డిమాండ్



టి.కొత్తపల్లిలోని సామాజిక ఆస్పత్రి

- గర్భిణిని రూ.5 వేలు అడిగిన వైద్యురాలు
- టి.కొత్తపల్లిలో ఘటన



ఆస్పత్రి బయట వేచి చూస్తున్న గర్భిణి లావణ్య

ఐ.పోలవరం: నిండు గర్భిణి పురిటి నొప్పులతో ప్రభుత్వాస్పత్రిని ఆశ్రయించగా అక్కడ సిబ్బంది తీరుతో ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మురముళ్ల గ్రామానికి చెందిన గోడ లావణ్య అనే గర్భిణికి పురుడునొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు టి.కొత్తపల్లి సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి గైనకాలజిస్టు అన్ని పరీక్షలు చేసి, వెంటనే ఆపరేషన్ చేయాలని లేదంటే ప్రమాదమని చెప్పారు. అయితే ఆపరేషన్ కోసం మత్తు డాక్టరుకు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో లావణ్య బంధువులకు ఏం చేయాలో పాలుపోలేదు. డబ్బులు లేవని ప్రాధేయపడినా వైద్య సిబ్బంది కనికరం చూపకపోవడంతో గర్భిణిని ఇంటికి తీసుకెళ్లిపోయారు. కాగా.. ఆస్పత్రిలో ఎదురైన చేదు అనుభవాన్ని లావణ్య స్వయంగా విలేకరులకు తెలిపారు. దీనిపై ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ దయానాను వివరణ కోరగా ఆ విషయం తన దృష్టికి రావడంతో ఆస్పత్రికి వెళ్లానన్నారు. మత్తు డాక్టరుకు ఇవ్వాలంటూ అక్కడి వైద్యురాలు డబ్బులు డిమాండ్ చేశారన్న బాధితుల ఆరోపణపై విచారణ చేయిస్తామని తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

కాకినాడ క్రైం: కాకినాడలోని దుమ్ముల పేటలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో సీనం చిన్న, కొండ్రు తాతారావు అనే వ్యక్తులపై పలువురు కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కాగిత ప్రసాద్ మృతదేహం

దేవరపల్లి: గ్రామానికి చెందిన కాగిత ప్రసాద్ (50) స్థానిక పెట్రోలు బంకు వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. కరోనా సమయంలో ప్రసాద్ భార్య, ఇద్దరు కుమారులు మృతి చెందాడు. అప్పటి నుంచి ప్రసాద్ మానసికంగా ఇబ్బంది పడుతూ మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలంగా విపరీతంగా మద్యం తాగుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం స్థానిక ఐఓసీ పెట్రోల్ బంకు వద్ద మృతి చెందాడు.

చికిత్స పొందుతూ మహిళ

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. అయినవిల్లి మండలం వెలవెలపల్లి గ్రామానికి చెందిన నేదునూరి గంగరాజు అమలాపురం వెచ్చవారి అగ్రహారంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 23వ తేదీన స్కూటర్‌పై భార్య సావిత్రితో కలిసి హోమియో మందుల కోసం ముమ్మిడివరం వస్తుండగా, బొండాయికోడు సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో భార్యాభర్తలిద్దరూ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన సావిత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ముమ్మిడివరం ఎస్సై జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి మోటారు సైకిలిస్టు

గోపాలపురం: మోటారు సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన హుకుంపేటలో జరిగింది. ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపవరం గ్రామానికి చెందిన జాలపర్తి సుధీర్ (34) బుధవారం మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై తన అత్తగారింటికి గోపాలపురం మండలం కరగపాడుకు బయలుదేరాడు. హుకుంపేట – రాంపాలెం గ్రామాల మధ్య రోడ్డు మలుపులో మోటారు సైకిల్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సుధీర్‌కు రెండేళ్ల క్రితమే వివాహమైంది. భార్య దుర్గాశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త దాడిలో వివాహిత

రాజమహేంద్రవరం రూరల్: అదనపు కట్నం కోసం అల్లుడు చితకబాదడంతో తన కుమార్తె మృతి చెందిందని హుకుంపేట డిబ్లాకుకు చెందిన బత్తిన లక్ష్మి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. హుకుంపేట డిబ్లాకుకు చెందిన కర్రి దుర్గాభవాని అలియాస్ చిన్నారి (19)కి రెండేళ్ల క్రితం రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేటకు చెందిన కర్రి ఈశ్వర్‌తో ప్రేమ వివాహం జరిగింది. ఆ సమయంలో దుర్గాభవాని తల్లిదండ్రులు రూ.1.50 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఈశ్వర్ ఏసీ మెకానిక్‌గా పనిచేసేవాడు. అయితే కొంతకాలంగా పనికి వెళ్లకపోవడంతో దుర్గాభవాని పుట్టింటికి వచ్చేసింది. అయితే కర్రి ఈశ్వర్ మరో రూ.లక్ష కట్నం తీసుకురావాని తరచూ వేధించేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి హుకుంపేట డి బ్లాకులోని అత్తగారింటికి ఈశ్వర్ వచ్చాడు. అక్కడ ఉంటున్న దుర్గాభవానిని కొట్టుకుంటూ రోడ్డుపైకి లాక్కొచ్చాడు. అతడి దెబ్బలకు దుర్గాభవాని తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి బత్తిన లక్ష్మి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు

- గోపులంక పుష్కరఘాట్ వద్ద ఘటన
- విహారయాత్రకు వచ్చిన ఏడుగురు యువకులు



ప్రమాదానికి ముందు ఇసుక తిన్నెలపై సాయిచంద్ర (ఫైల్)

తాళ్లరేవు: ఇంజినీరింగ్ విద్యార్థుల విహారయాత్ర విషాదాంతమైంది. యానాం సందర్శనకు వచ్చిన విద్యార్థుల్లో ఒక యువకుడు గోదావరిలో గల్లంతయ్యాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. శశి వేలివెన్ను ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఎల్లిన శివరామ్, మల్లిపూడి నిఖిల్ లక్ష్మణ్, మండా వంశీ, వెంపటి సంతోష్, కుతాని సాయిచంద్ర, కార్తిక్, మిజోన్స్ అనే యువకులు కారులో బుధవారం విహారయాత్రకు బయలుదేరారు. ఉదయమే రాజమహేంద్రవరం వచ్చి అక్కడ అన్నీ ప్రదేశాలను చూశారు. మధ్యాహ్నం కేంద్రపాలిత ప్రాంతమైన యానానికి వచ్చారు. యానాంలోని పలు ప్రదేశాలు సందర్శించిన అనంతరం తిరిగి వెళుతూ గౌతమి గోదావరి చెంతన గల గోపులంక పుష్కరఘాట్ వద్ద ఫొటోలు తీసుకునేందుకు ఆగారు. వీరిలో కుతాని సాయిచంద్ర ఫొటోలు తీసుకుంటూ అదుపు తప్పి గోదావరిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు ప్రయత్నించిన శివరామ్ కూడా గోదావరిలో కొట్టుకుపోసాగాడు. మిగిలిన విద్యార్థులు వెంటనే స్పందించి వారిని రక్షించడానికి ప్రయత్నించారు. శివరామ్‌ను కాపాడారు గానీ గోదావరి ప్రవాహానికి సాయిచంద్ర (21) కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న కోరంగి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని స్థానిక మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటి కారణంగా గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది. రాజమహేంద్రవరానికి చెందిన సాయిచంద్ర శశి వేలివెన్ను కళాశాలలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. శివరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

గతేడాది ఇదే నెలలో..

ఇదే ప్రదేశంలో గతేడాది అక్టోబరు 21న ఇలాంటి ఘటనే జరిగింది. తణుకు పట్టణంలోని సజ్జాపురానికి చెందిన ఏడుగురు యువకులు పుట్టినరోజు వేడుకల కోసం యానాం వచ్చి తిరిగి వెళుతూ గోపులంక వద్ద స్నానానికి దిగారు. వారిలో నలుగురు యువకులు గల్లంతై మృతి చెందారు.